క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న డీవైఈఓ రామలక్ష్మణమూర్తి

కె.గంగవరం: కొత్తగా అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల్లో నూటికి నూరు శాతం విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా మెరుగైన విద్యను అందించాలని రామచంద్రపురం డివిజన్ డీవైఈఓ రామలక్ష్మణమూర్తి అన్నారు. మండలంలో నూతనంగా అప్‌గ్రేడ్ అయిన కోట, భట్లపాలిక ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన పరిశీలించారు. తొలుత విద్యార్థుల హాజరు శాతం, పాఠశాల రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సులువు పద్ధతిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా మంచి ఉత్తీర్ణత సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు కూడా ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించి ఉపాధ్యాయులకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. ఎంఈఓ-2 చోడిశెట్టి ఆంజనేయులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న సీఐ

కపిలేశ్వరపురం (మండపేట): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వ్యసనాలకు అలవాటు పడితే జీవితం అగమ్యగోచరంగా మారుతుందని మండపేట సీఐ సురేష్ బాబు హెచ్చరించారు. మండపేటలోని అక్షర స్కూల్‌లో మత్తు పదార్థాల వినియోగం-ప్రమాదకర పరిస్థితుల అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ, మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, సరఫరా చేసినా, వినియోగించినా చట్ట పరిధిలో తీవ్రమైన చర్యలకు లోనవుతారని హెచ్చరించారు. ఈ తరహా కేసుల్లో ఇరుక్కున్న విద్యార్థులు ఉద్యోగావకాశాల్లో సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం పట్టణంలోని రాజా కాక్ షట్ ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్-1, లాంగ్వేజ్ పండిట్ తెలుగు-1, ఎస్జీటీ-2 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని రామచంద్రపురం ఎంఈఓ తాడి వీరరాఘవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను సెప్టెంబరు 3వ తేదీలోగా రామచంద్రపురం విద్యావనరుల కేంద్రం (ఎంఈఓ కార్యాలయం)లో సమర్పించాలని సూచించారు. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు కూడా తమ కార్యాలయానికి నకలును అందజేయాలని కోరారు.

అన్ని ధర్మాలకు మూలం సనాతనం

కొత్తపేట: అన్ని ధర్మాలకు సనాతన ధర్మమే మూలమని, సనాతన ధర్మం ఉన్నచోట అన్ని ధర్మాలు వర్ధిల్లుతాయని ప్రముఖ వేద పండితుడు, ఘనాపాఠీలు అన్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలి సమయమంతుల అండ్ మాతంశెట్టి వార్ల అన్నదాన సత్రంలో మంగళవారం వేద సభ నిర్వహించారు. దేవస్థానం ఈఓ భాగవతుల వెంకట రమణమూర్తి పర్యవేక్షణలో జరిగిన సభలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన వేద పండితులు, ఘనాపాఠీలు పాల్గొన్నారు. వారు చతుర్వేదములు, వేదములు పఠించి సనాతన ధర్మం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వేదాశీర్వచనం చేశారు.

హాస్టల్‌లో ర్యాగింగ్‌పై విచారణ చేయాలి

సఖినేటిపల్లి: రాజమహేంద్రవరం పరిధిలోని మోరంపూడి శ్రీచైతన్య హాస్టల్‌లో కలకలం సృష్టించిన ర్యాగింగ్‌పై సత్వర విచారణ చేపట్టాలని రాష్ట్ర మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు, రామేశ్వరానికి చెందిన సరెళ్ళ విజయ్ ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సఖినేటిపల్లిలో మాట్లాడుతూ, హాస్టల్‌లో ఆలస్యంగా వెలుగు చూసిన శంకరగుప్తానికి చెందిన విద్యార్థి గుర్రం విన్సెంట్ ప్రసాద్‌పై సహచర విద్యార్థులు పైశాచికత్వం, ఐరన్ బాక్స్‌తో పొట్ట, చేతులపై విచక్షణా రహితంగా వాతలు పెట్టిన ఘటన తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

లంబోదరుడి ఆగమనానికి రెడీ.!

- వినాయక ఉత్సవాలకు సర్వం సిద్ధం
- భిన్నమైన ఆకృతుల్లో ప్రతిమలు
- పూలు, పూజా సామగ్రికి గిరాకీ





కొలువుదీరేందుకు వాహనాలపై తరలివస్తున్న గణనాథులు

రాయవరం: విఘ్నాలు తొలగించే వినాయకుని చవితి వేడుకలు తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు భక్తజనం సిద్ధమైంది. దీంతో ఏ వీధిలో చూసినా వినాయక విగ్రహాల సందడే కనిపిస్తోంది. బుధవారం వినాయక చవితి వేడుకలు ప్రారంభం కానుండగా, మంగళవారం గణపతి విగ్రహాలు.. పత్రి, పూలు, పండ్లు విక్రయాలతో మార్కెట్ అంతా కళకళలాడుతోంది. పర్యావరణ వేత్తలు, మేధావులు, సైన్స్ ఉపాధ్యాయులు మట్టి విగ్రహాలను ఉత్సవాల్లో వినియోగించాలని ప్రచారం చేస్తున్న నేపథ్యంలో వాటికి ప్రాధాన్యం పెరుగుతుంది. గణనాథుడిని ప్రతిష్ఠించేందుకు ఉత్సవ కమిటీలు ఎక్కడికక్కడ మండపాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటు, మండపేట రూరల్, రామచంద్రపురం రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలోని 120 గ్రామాల్లో చవితి వేడుకలు నిర్వహించనున్నారు.

భారీగా విగ్రహాల ధరలు

వినాయక విగ్రహాలను వ్యాపారంగా మలచుకుంటున్న కొందరు వ్యాపారులు వివిధ రకాల సైజులు, ఆకృతుల్లో విగ్రహాలు తయారు చేయించి అమ్మకాలు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ చిన్న విగ్రహాలు రూ.200 మొదలు రూ.4 వేల వరకు పలుకుతున్నాయి. మట్టి విగ్రహాలు చిన్నవి రూ.250 మొదలు రూ.4 వేల వరకు పలుకుతున్నాయి. ఐదు అడుగుల నుంచి తొమ్మిది అడుగుల మట్టి విగ్రహాల ధరలు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు పలుకుతున్నాయి.

జోరుగా విక్రయాలు

వినాయక విగ్రహాలతో పాటు పూజా సామగ్రికి కూడా గిరాకీ పెరిగింది. విగ్రహాలను బట్టి ప్రత్యేకంగా పూల దండలు తయారు చేస్తుండగా, పట్టు వస్త్రాలు, వినాయక టీ షర్టులు, పూలు, పత్రి, పండ్ల విక్రయాలు జోరుగా సాగాయి. ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు పత్రిని తీసుకొచ్చి మార్కెట్‌లో అమ్మకాలు సాగిస్తున్నారు. వీటిలో ప్రధానంగా మామిడాకులు, తంగేడు, ధర్మగడ్డి, జిల్లేడు, మారేడు, సీతాఫలం, వెలగకాయలు, గరిక, మర్రి ఆకులు, మర్రి కాయలు విక్రయిస్తున్నారు.

అధిక డిమాండ్

పూజా సామగ్రిలో పూలు, పండ్లకు మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉంది. పూలలో చామంతి పూలు అధికంగా అమ్ముడవ్వగా.. కిలో చామంతి పూల ధర రూ.600కు కొనుగోలు చేశారు. సాధారణ రోజుల్లో కిలో చామంతి రూ.200 నుంచి రూ.300 వరకు ఉంటుంది. బంతి పూలు సాధారణ రోజుల్లో కిలో రూ.50 ఉండగా, చవితిని పురస్కరించుకుని కిలో రూ.150 పలికింది. చిట్టి గులాబీలు సాధారణ రోజుల్లో రూ.150ల ఉండగా, ఇప్పుడు కిలో రూ.300 అయ్యింది. అలాగే అరటి, దానిమ్మ, బత్తాయి వంటి పండ్లకు గిరాకీ పెరగడంతో అరటి పండ్లు డజను రూ.70 వరకు ఉండగా, నాలుగు ఆపిల్ పండ్ల ధర రూ.120 వరకు ఉంది. ఇలా ప్రతి పండ్ల ధర రెట్టింపు అయ్యింది.

ప్రధాన కూడళ్లలో వెలసిన మండపాలు

మండలంలోని పలు గ్రామాల్లో గణపతి వేడుకలు తొమ్మిది రోజులపాటు నిర్వహించడానికి ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద తాత్కాలిక మండపాలు ఏర్పాటు చేసి వాటిని అందంగా అలంకరించారు. మండపాల్లో బుధవారం ఉదయం స్వామి వారి విగ్రహాలను ప్రతిష్ఠించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వివిధ గ్రామాల నుంచి స్వామి వారి విగ్రహాలను ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై తరలిస్తున్నారు.

చాక్‌చక్య గణపయ్య



చాక్ పీస్ వినాయకుడు



జి.శ్రీను, డ్రాయింగ్ టీచర్, ద్రాక్షారామ

రామచంద్రపురం రూరల్: రెండు చాక్ పీస్‌లను బొజ్జ గణపయ్య ఆకృతిలో మలిచి చూపరులను ఆకట్టుకుంటున్నారు. రామచంద్రపురం మండలం హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ జి. శ్రీను. ఒక చాక్ పీస్‌ను వినాయకుడిగాను, మరో చాక్ పీస్‌ను చెవులు, కలువ రేకులను మలిచి అతికించారు. పూర్తి అయిన వినాయక ప్రతిమ విరిగిపోకుండా ఉండటం కోసం ఫెవిక్విక్‌ను పై పూతగా వేసినట్లు తెలిపారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- అమ్మకాలు, కొనుగోళ్లతో కూడళ్లలో రద్దీ
- పత్రి, పండ్లు, పుష్పాల అమ్మకాలు
- నేటి నుంచే గణపతి నవరాత్ర మహోత్సవాలు



కాజులూరులో నవరాత్ర ఉత్సవాల్లో ప్రతిష్ఠించేందుకు సిద్ధం చేసిన వినాయక విగ్రహం



గొల్లపాలెంలో వినియోగదారులతో కళకళలాడుతున్న మార్కెట్

కాజులూరు: వినాయక చవితి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకునేందుకు మండల గ్రామాల్లోని ప్రజలు సర్వం సిద్ధమయ్యారు. గ్రామాల్లోని విఘ్నేశ్వరాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ఆలయాల ఎదుట చలువ పందిళ్లు వేశారు. గ్రామాల్లో పలు ప్రధాన కూడళ్లలోనూ, ఆటో స్టాండ్, ట్యాక్సీ స్టాండ్లలోనూ చవితి నిర్వహించేందుకు తాటాకు పందిళ్లు వేశారు. వినూత్నంగా రంగురంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను చవితి ఉత్సవాల్లో ప్రతిష్ఠించేందుకు సిద్ధం చేసి ఉంచారు. సుందరమానంగా చూపరులను ఆకర్షించే విధంగా పోటాపోటీగా తయారు చేసిన వినాయక విగ్రహాలు శుక్రవారం రాత్రికే ఆలయాలకు చేరాయి. ప్రజలు గృహావాసాల వద్ద వినాయక చవితి పూజలు నిర్వహించుకునేందుకు పాలవెల్లి, పత్రి, పలురకాల ఫలాలు కొనుగోలు చేసుకున్నారు. పూజ సామగ్రి, పత్రి విక్రయాలతో మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, జగన్నాథగిరి, కోలంక తదితర ప్రధాన గ్రామాల్లో మార్కెట్ సెంటర్లు కళకళలాడాయి.

భారీ సంఖ్యలో గణనాథుల ప్రతిష్ఠ

కె.గంగవరం: డివిజన్ పరిధిలో వినాయక చవితి పర్వదినానికి ఈ ఏడాది భారీ సంఖ్యలో గణనాథులు కొలువుదీరనున్నారు. రామచంద్రపురం పట్టణంతో పాటు కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్‌లోని మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో వాడవాడలా గణనాథులను కొలువదీర్చేందుకు నిర్వాహకులు మండపాలను సిద్ధం చేశారు. విగ్రహాలను తయారు చేసే శిబిరాల వద్ద వివిధ గ్రామాల భక్తులు కొనుగోళ్లకు భారీగా తరలివెళ్తున్నారు. దీంతో పట్టణాల్లో, పల్లెల్లో సందడి నెలకొంది. మట్టిగణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడే యజ్ఞంలో భాగమవుదామని ప్రముఖ దంత వైద్యుడు, భీమేశ్వర దంత వైద్యశాల అధినేత క్రాంతికుమార్, హెచ్ఎం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కె.గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థులతో డాక్టర్ క్రాంతి కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు కలసి సుమారు 1500 మట్టి గణపతి విగ్రహాలను మంగళవారం ప్రజలకు పంపిణీ చేశారు.

అనుమతి తప్పనిసరి



గణపతి విగ్రహాలను ఎక్కడ ప్రతిష్ఠించినా నిర్వాహకులు అనుమతి తీసుకోవాలి. మండలంలో 68 విగ్రహాల కొనుగోలుకు ఆన్‌లైన్‌లో అనుమతికి దరఖాస్తు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండపాల వద్ద పోలీస్ నిఘా ఉంటుంది. వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలి.

– డి.సురేష్‌బాబు, ఎస్సై, రాయవరం.

నిబంధనలు పాటించాలి



వినాయక మండపాల వద్ద విద్యుత్ వినియోగం విషయంలో నిబంధనలు పాటించాలి. విద్యుత్ సరఫరాకు వినియోగించే తీగలు నాణ్యతగా ఉండాలి. ఇనుప రేకులకు తగలకుండా, కిందకి వేలాడకుండా ఏర్పాటు చేసుకోవాలి. ఈపీడీసీఎల్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

– ఎస్.శ్రీనివాసులు, ఏఈ, ఈపీడీసీఎల్, రాయవరం.

భారీ గణనాథులకు తూర్పు నుంచే తుది మెరుగులు



ఖైరతాబాద్‌లోని గణనాథుని విగ్రహానికి రంగులు వేసి తుది మెరుగులు దిద్దుతున్న భీమేష్



ఈ ఏడాది ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన 70 అడుగుల చతుర్ముఖ మహాగణపతి

కాజులూరు: దేశంలో వినాయక ఉత్సవాల నిర్వహణలో తెలుగు వారిది ప్రత్యేక స్థానం. అందులో తెలంగాణలోని ఖైరతాబాద్‌లో ఏ ఏడాదికాఏడాది వినూత్న రీతిలో భారీ విగ్రహాలను ప్రతిష్ఠిస్తూ హైదరాబాదీలు ప్రాధాన్యతను చాటుకుంటుంటారు. అయితే ప్రాముఖ్యత చెందిన ఈ విగ్రహాలకు ఏటా రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దేది మన గోదారోళ్లు కావడం విశేషం. కాజులూరు మండలం గొల్లపాలేనికి చెందిన «సత్య ఆర్ట్స్» సభ్యులు గత 21 ఏళ్లుగా ఖైరతాబాద్ వినాయకుడికి రంగులు వేసే పని నిర్వహిస్తున్నారు. గతంలో గ్రామానికి చెందిన గీసాల వీరవెంకటసత్యనారాయణ (సత్య) తన మిత్రబృందంతో కలసి ఏటా ఖైరతాబాద్ వినాయకుడికి రంగులు వేసేందుకు హైదరాబాద్ తరలి వెళ్లేవారు. అయితే గత కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో సత్య మృతి చెందగా ఆయన సోదరుడు భీమేశ్వర రావు (భీమేష్) ఆ బాధ్యతను స్వీకరించారు. ఈ ఏడాది ఖైరతాబాద్‌లో నిర్వాహక కమిటీ సభ్యులు 70 అడుగుల ఎత్తున చతుర్ముఖావతారంలో విశ్వశాంతి మహాగణపతి స్వామి వారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మండపంలో స్వామివారికి కుడిపక్క పూరీజగన్నాథస్వామి, ఎడమ పక్క లక్ష్మీసమేత హేమశివ స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. పక్కన ఏర్పాటు చేసిన మండపాల్లో కుడిపక్క వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు, ఎడమపక్క గ్రామ దేవత గజ్జెలమ్మ అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాలకు గొల్లపాలెం నుంచి వెళ్లిన సత్య ఆర్ట్స్ బృందం 20 మంది గత 15 రోజులుగా శ్రమించి రంగులు దిద్దే పని నిర్వహించారు. «సత్య ఆర్ట్స్» సభ్యులు «సాక్షి»తో మాట్లాడుతూ లాభనష్టాల మాట ఎలా ఉన్న ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకత సాధించిన ఖైరతాబాద్ వినాయకుని విగ్రహానికి తాము రంగులు వేయడం ఎంతో సంతృప్తికరంగా ఉందన్నారు. సత్య సోదరుడు భీమేష్ మాట్లాడుతూ తన అన్న చేపట్టిన పనిని తాను నిర్విరామంగా ఏటా కొనసాగించదలిచానన్నారు.

మదర్ థెరిసా యువతకు ఆదర్శం



ద్వారపూడిలో మదర్ థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): మదర్ థెరిసా నేటి యువతకు అత్యంత ఆదర్శప్రాయమని మంగళవారం నిర్వహించిన ఆమె జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అన్నారు. ద్వారపూడి పీహెచ్‌సీలో థెరిసా సేవా సమితి సభ్యులు, పీహెచ్‌సీ వైద్యులు జగదీప్, జాన్ వెస్లీ ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంకటాల మురళీకృష్ణ, గేదెల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

రాయవరం: స్నేహ స్వచ్ఛంధ సేవ సంస్థ ఆధ్వర్యంలో రాయవరంలోని వృద్ధాశ్రమంలో బుధవారం వృద్ధులకు మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకొని స్థానిక సంజయ్ గాంధీ వృద్ధాశ్రమంలోని 40 మంది వృద్ధులకు స్నేహ స్వచ్ఛంధ సేవ సంస్థ అధ్యక్షురాలు డి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత సేవా మూర్తి మదర్ థెరిస్సాగా పలువురు పేర్కొన్నారు. మదర్ థెరిసా చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కృష్ణకుమారి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: మదర్ థెరిసా జీవితం మానవత్వానికి నిలువెత్తు ప్రతీక అని తూర్పుగోదావరి జిల్లా వలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు వెలగల ఫణీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మదర్ థెరిసా యూత్ అధ్యక్షుడు చంద్రమళ్ల సంజయ్‌రాజు ఆధ్వర్యంలో మంగళవారం మదర్‌థెరిసా జయంతి నిర్వహించారు. ఫణీకృష్ణారెడ్డి మాట్లాడుతూ, మదర్ థెరిస్సా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్నంటూ సమాజ సేవకు దేశం, రాష్ట్రం, ప్రాంతంతో సంబంధం లేదని నిరూపించిన మానవతా మూర్తి మదర్ థెరిసా అన్నారు. కార్యక్రమంలో మదర్ థెరిసా స్వచ్ఛంద సేవా సంస్థ వైస్ ప్రెసిడెంట్ దువ్వ చంద్రశేఖర్, సెక్రటరీ కందుకూరి గంగరాజు, జాయింట్ సెక్రటరీ పలివెల సురేష్, ట్రెజరర్ చంద్రమళ్ల రాజు, యూత్ సభ్యులు సుధాకర్, వీరబాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా



మట్టి ప్రతిమలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



మండపేటలో మట్టి ప్రతిమతో చిన్నారులు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో మంగళవారం గణపతి నవరాత్ర ఉత్సవాల ఏర్పాట్లతో సందడి నెలకొంది. అంగర ఆదిగణపతి నవరాత్ర ఉత్సవ శిబిరాన్ని ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఆ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పడమర ఖండ్రిక, అంగర, కపిలేశ్వరపురం, టేకి, వల్లూరు తదితర గ్రామాల్లో నవరాత్ర ఉత్సవ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా గ్రామాల్లోని సెంటర్లలో చవితి పూజ సామాగ్రి కొనుగోలుతో సందడి నెలకొంది.

మండపేటలో..

మండపేట పట్టణం కలువపువ్వు సెంటర్‌లో పట్టణంతో పాటు సమీప గ్రామాల ప్రజలు చవితి పూజ సామాగ్రి కొనుగోలు కోసం తరలివచ్చారు. దీంతో కేపీరోడ్డు, బస్టాండ్ రోడ్డు, గుమ్మిలేరు రోడ్డు, మున్సిపల్ కార్యాలయ రోడ్డు రద్దీతో నిండాయి. ద్వారపూడి, ఏడిద, మారేడుబాక, ఇప్పనపాడు, వెలగతోడు, పాలతోడు, జెడ్ మేడపాడు, చిన ద్వారపూడి, కేశవరం, మెర్నిపాడు తదితర గ్రామాల్లోని మండపాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు సిద్ధం చేశారు.

పర్యావరణ హితం లక్ష్యంగా..

మండపేట పట్టణంలోని ఆపిల్ ప్లే స్కూల్‌లో పర్యావరణ హితం లక్ష్యంగా చవితి ఉత్సవాన్ని జరుపుకున్నారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు రంగా మాస్టర్, ఉపాధ్యాయినిలు సుప్రియరేణుక, పూర్ణ, ఝాన్సీ, విజయదుర్గ, మానస, శిరీష పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

రాయవరం: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం వినాయక చవితి వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సైన్స్ ఉపాధ్యాయులు, నేషనల్ గ్రీన్‌కోర్ టీచర్ల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి విద్యార్థుల ద్వారా పాఠశాల పరిసరాల్లో ప్రజలకు అందజేశారు. మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడదాం అనే నినాదంతో జిల్లా వ్యాప్తంగా 1,571 ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పలు పాఠశాలల్లో మట్టి విగ్రహాలను విద్యార్థులు తయారు చేసి ఉచితంగా అందజేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నెలకొల్పి, వాటిని నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణానికి తీరని ముప్పు ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా జలచరాలకు తీరని నష్టం ఏర్పడుతుందని ఉపాధ్యాయులు వివరించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు వినాయక వేషధారణలతో అలరించారు. ఎకో ఫ్రెండ్లీ గణనాథుడ్ని పూజించాలని విద్యార్థులు ప్లకార్డులతో నినదించారు. మట్టి విగ్రహాలను తయారు చేసి, ఉచితంగా అందజేసిన విద్యార్థులను పలువురు అభినందించారు.

విద్యార్థులు స్వయంగా తయారు చేసి..

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి గ్రామస్తులకు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యు.మాచిరాజు ఆధ్వర్యంలో డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథ ప్రసాద్ పర్యవేక్షణలో విద్యార్థులు స్వయంగా విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేశారు. విద్యార్థి హరీష్ వినాయకుని వేషధారణలో ఈ పంపిణీలో పాల్గొని మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే వాడమని గ్రామస్తులకు వివరించడంతో గ్రామస్తుల్లో ఆసక్తి రేకెత్తింది.

విద్యుత్ చార్జీల నిలువు దోపిడీని అరికట్టాలి



కె.గంగవరం సెంటర్లో ధర్నా చేస్తున్న ప్రజా సంఘ నాయకులు, ప్రజలు

కె.గంగవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పాలిట అక్రమంగా వసూలు చేస్తున్న విద్యుత్ చార్జీల నిలువు దోపిడీని వెంటనే నిలుపుదల చేయాలని ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ ప్రజా సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కె.గంగవరం బస్టాండ్ సెంటర్ వద్ద మంగళవారం వారు ధర్నా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ తదితరులు మాట్లాడుతూ, ప్రస్తుతం బలవంతంగా బిగిస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను తక్షణమే నిలిపివేయాలన్నారు.

ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ భారాలను ప్రజలపై మోపొద్దని డిమాండ్ చేశారు. ఉమ్మడి కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి ఇప్పుడు భారీగా పెంచి వసూళ్లు చేయడం దారుణమన్నారు. విద్యుత్ చార్జీలను పెంచి పేద, మధ్య, సామాన్య తరగతి ప్రజలు నడ్డి విరిచిందన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేసే విధంగా చర్యలు ఉన్నాయని వెంటనే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని వారు కోరారు. ధర్నాలో ఐఎఫ్‌టీయూ నాయకులు చింతా రాజారెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు నవీన్, రైతు కూలీ సంఘం నాయకులు జనపల్లి ప్రసాద్, రావి వెంకట్రావు, అనుసూరి సత్యనారాయణ, ఖండవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వ్యాసరచన పోటీలు

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో జెడ్పీ హైస్కూల్‌లో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్ఏఎల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు అంగర వేణుగోపాలాచార్యులు (కృష్ణశ్రీ) తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ భాషా వేత్త గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ పోటీలను నిర్వహించనున్నామన్నారు. అర్హులైన, ఆసక్తి కలిగిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కథారచన పోటీల్లో చక్కని ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు ఎంపీడీఓ ఎ.రాజు, ఎంఈఓ బి.అప్పాజీ, ప్రధానోపాధ్యాయుడు ఎంవీవీఎస్ఎన్ మూర్తి చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నామని ఆయన పేర్కొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు యథావిధిగా కొనసాగించాలి



రామచంద్రపురంలో సమావేశమైన దివ్యాంగుల హక్కుల వేదిక నాయకులు

రామచంద్రపురం: ఇటీవల కూటమి ప్రభుత్వం తొలగించిన దివ్యాంగుల పింఛన్లు గతంలో మాదిరిగా యథావిధిగా కొనసాగించాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్ కుమార్‌లు మాట్లాడుతూ పుట్టుకతో వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగుల వైకల్య శాతాన్ని కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా తగ్గించి పింఛన్లు ఎగ్గొట్టడం క్షమించరాని విషయమన్నారు. గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్లలోని వైకల్య శాతాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న ఉదయం 10 గంటలకు రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద చేపట్టనున్న దివ్యాంగుల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపు ఇచ్చారు.